


## ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం

04

- అదే.. నా మిత్రధర్మం
- ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నా
- సీఎం రేవంత్ రెడ్డి

05

## మాదిగల పక్షాన నిలిచా !

ఎస్సీ వర్గీకరణ విషయంలో వారి వైపే న్యాయం ఉంది..



సంపుటి :03 | సంచిక :29 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

శుక్రవారం 06, మార్చి 2026

వెల ₹5



04

## పోలీసుల్లో జోష్

ఘనంగా ప్రారంభమైన 4వ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్

వాలీబాల్ ఆడి సిబ్బందిని ఉత్సాహపరిచిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్





# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

02

### ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి..

రాష్ట్రంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను అమలు చేయనుంది. శుక్రవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ విధివిధానాలను వెల్లడించారు. మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల వేగవంతం, పాఠశాలల ఆధునికీకరణపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. కాగా, కీలకమైన ఈ భేటీకి గైర్హాజరైన భూపాలపల్లి డీఎఫ్ఓపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించడం కలకలం రేపింది.

- యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమం చేపట్టాలి
- మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి..
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి
- సమావేశానికి డీఎఫ్ వో గైర్హాజరు కావడంపై సీరియస్
- మానుకోటలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం
- ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి: మంత్రి కొండా సురేఖ



## పరకాల అభివృద్ధే నా లక్ష్యం

- అభివృద్ధి కోసం ఎక్కడికైనా వెళ్తా
- మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

03

## విద్యుత్ వినియోగదారులకు శుభవార్త



- 2026-27లోనూ విద్యుత్ ఛార్జీల పెంపు లేదు!
- బహిరంగ విచారణలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రకటన
- సాంకేతికతతో మెరుగైన సరఫరా.. గిరిజన ఆవాసాలకు 100 శాతం విద్యుదీకరణ

02

## త్వరలో ఓటర్ల జాబితా ప్రక్షాళన

- 'ఎస్ఐఆర్' ప్రక్రియ ప్రారంభానికి రంగం సిద్ధం
- తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ప్రక్రియ
- నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

05



అక్షర దర్బార్ Voice of the people

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి..
- యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమం చేపట్టాలి
- మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి..
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి
- సమావేశానికి డీఎఫ్ వో గైర్హాజరు కావడంపై సీరియస్
- మానుకోటలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం
- ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి: మంత్రి కొండా సురేఖ



అక్షరదర్బార్, మహబూబాబాద్ : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా కొనసాగుతుందని మంత్రి పొంగులేటి వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో కదలాలని మంత్రి సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చడంతో పాటు సిబ్బందిని వెంటనే నియమించుకోవాలి. మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, కొత్త వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలి. పాఠశాల వాహనాలకు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలి అని అధికారులను హెచ్చరించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా జీపీఆర్ఎస్ ద్వారా వాహనాలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి` అని మంత్రి ఆదేశించారు.

### - స్లమ్ ఏరియాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

స్లమ్ ఏరియాల్లో నివసించే వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. నిధుల మంజూరులో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే నివేదికలు పంపాలి. ప్రతి హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేపట్టాలి. అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వసతులను పరిశీలించాలి. మార్చి నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కావాలి. గ్రౌండ్ కాని ఇండ్లను లబ్ధిదారుల అంగీకారంతో రద్దు చేయాలి. అనర్హులకు ఇండ్లు కేటాయిస్తే కలెక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది అని మంత్రి హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో పాత ఇళ్లు ఉన్న చోట ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అటవీ అధికారులు ఆటంకాలు కలిగించవద్దు. అటవీ, రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలి. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. అటవీ ప్రాంతాల్లోని పాత రహదారుల అభివృద్ధికి సహకరించాలి. భూ భారతిలో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి. అక్కడ అక్రమాలు జరిగితే సహించే ప్రసక్తే లేదు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు వేగంగా పూర్తి చేయాలి. శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాల కోసం ప్రతిపాదనలు పంపాలి. ప్రస్తుతం వాడుకలో ఉన్న భవనాలకు రంగులు వేయించాలి. అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చాలి. మహిళా పథకాలన్నీ ఈ 99 రోజుల్లోనే పూర్తి కావాలి. ప్రతి జిల్లాలో ఒక ఎకో పార్కును ఏర్పాటు చేయాలి అని పొంగులేటి ఆదేశించారు. ఈ సమావేశానికి భూపాలపల్లి డీఎఫ్ వో గైర్హాజరు కావడం పట్ల మంత్రి సీరియస్ అయ్యారు. ఆయనపై ఇరవై నాలుగు గంటల్లో చర్యలు ఉంటాయని అన్నారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్థితిగతులను దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.



# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు!

- విద్యుత్ వినియోగదారులకు శుభవార్త
- బహిరంగ విచారణలో టీజీఎన్ పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రకటన
- సాంకేతికతతో మెరుగైన సరఫరా.. గిరిజన ఆవాసాలకు 100 శాతం విద్యుదీకరణ

అక్షరదర్బార్, హనుమకొండ :
తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) పరిధిలోని కోట్లాది మంది వినియోగదారులకు భారీ ఉపశమనం లభించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ టారిఫ్ ధరలలో ఎటువంటి పెంపుదల లేదని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ కలెక్టరేట్ వేదికగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ నేతృత్వంలో శుక్రవారం జరిగిన బహిరంగ విచారణలో ఆయన పాల్గొని సంస్థ ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. విద్యుత్ టారిఫ్, 'టైమ్ ఆఫ్ డే' ధరల్లో ఎలాంటి మార్పు లేదని, గ్రీన్ టారిఫ్ వినియోగదారులకు యూనిట్‌కు రూ. 0.66 అదనపు ఛార్జీ కొనసాగింపు ఉంటుందని, నెలకు రూ.18.50 / కేడబ్ల్యూగా నిర్ణయం జరిగిందని, 143.94 లక్షల జనాభాకు, 70.29 లక్షల కనెక్షన్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ అని వరుణ్ రెడ్డి చెప్పారు.

### - సాంకేతిక విప్లవం - డిజిటల్ సేవలు

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించేందుకు ఎన్పీడీసీఎల్ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుందని సీఎండీ తెలిపారు. 464 సబ్ స్టేషన్లు స్కాడాతో అనుసంధానం చేశామని, 33 పట్టణాల్లో జియో-మ్యాపింగ్ పూర్తయిందని వెల్లడించారు. నెట్‌వర్క్ పర్యవేక్షణకు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, వినియోగదారుల ఫిర్యాదుల కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

### - రైతులకు, పరిశ్రమలకు పెద్దపీట

పరిశ్రమలపై భారాన్ని తగ్గించాలన్న ప్రతినిధుల కోరిక మేరకు పీనల్ ఛార్జీల రద్దుపై సీఎండీ సానుకూలంగా స్పందించారు. ఖమ్మం జిల్లాలోని బోనకల్‌ను మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. రైతులకు ఓఆర్సీ రుసుము లేకుండా సేవలు, గిరిజన ప్రాంతాల్లో 2,072 ఆవాసాలకు విద్యుత్ విస్తరణ, రూ. 68.21 కోట్లతో 14,090 మిడిల్ పోల్స్ ఏర్పాటు, ప్రమాదాల్లో 22 శాతం తగ్గింపు వంటివి జరిగినట్లు సీఎండీ చెప్పారు.

### - బకాయిలు చెల్లించాలి.. కిసాన్ సంఘం

విచారణలో పాల్గొన్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు ఎన్పీడీసీఎల్ పనితీరును అభినందించారు. కొత్త ఉద్యోగాల నియామకం, లో-వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కొత్త లైన్లు వేయాలని కోరారు. భారత కిసాన్ సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ బకాయిలు, లిఫ్ట్ ఇరిగేషన్ బకాయిలను వెంటనే వసూలు చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. 2026-27 ఏడాదికి రూ. 22,754 కోట్ల ఆదాయ అవసరాలు ఉన్నాయని, ఇందులో రూ.12,521 కోట్ల లోటును ప్రభుత్వ సబ్సిడీ ద్వారా భర్తీ చేస్తామని సీఎండీ వివరించారు. ఈ సందర్భంగా టిజిఇఆర్ సి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ.. నాణ్యమైన సేవలు అందిస్తున్న సంస్థను కొనియాడారు.



# మృతురాలికి బీజేపీ నేత కీర్తిరెడ్డి నివాళి


అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన దుంపల ఆదిరెడ్డి మరణించగా వారి పార్థివ దేహానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందు పట్ల కీర్తి రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించినారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశా రు.ఈ సందర్భంగా వారి వెంట రాష్ట్ర నాయ కులు రాయరాకులు మొగిలి , మండల అధ్య క్షులు రామకృష్ణ, నాయకులు కానుగుల నాగ రాజు, ఉప్పు రాజు, రమణారెడ్డి, సమ్మయ్య, గిద్దమరి సురేష్, రాజశేఖర్, చంద్రమౌళి, ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ 3 గంటలూ జాగ్రత్త

- రాష్ట్రంలో భానుడి భగభగలు
- పెరగనున్న ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచనలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : మార్చి నెల ఆరంభంలోనే తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతుండటంతో హైదరాబాద్ వాతావరణ కేంద్రం (హెచ్ఎండీ) ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, మరో 3 గంటల పాటు ప్రజలు ఇళ్లు దాటి బయటకు రాకపోవడమే మంచిదని సూచించింది. ఉత్తర, తూర్పు జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటంతో ఆయా ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 39 నుండి 41 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు (మార్చి 7 నుండి 10 వరకు) ఇదే విధమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు కూడా వీస్తాయని అధికారులు హెచ్చరించారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఉండే ఎండలు మార్చిలోనే రావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ నగరంలో కూడా గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 37 నుండి 38 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఎండల ప్రభావం పంటలపై కూడా పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలమట్టం భారీగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.





# పరకాల అభివృద్ధే నా లక్ష్యం..


- అభివృద్ధి కోసం ఎక్కడికైనా వెళ్తా
- మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన పావుశెట్టి సునీల్ కుమార్

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడం తన ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం అవసరమైతే ఎక్కడికైనా వెళ్లి, ఎవరినైనా కలిసి నిధులు సాధిస్తానని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో పాలకమండలితోపాటు ఆయన చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పరకాల ఏసిపి సతీష్ బాబు, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాల ప్రజలు తనపై విశ్వాసం ఉంచి మున్సిపల్ చైర్మన్‌గా సేవ చేసే అవకాశం కల్పించినందుకు పట్టణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం అందిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.పట్టణంలో ఉన్న సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉందని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి పరకాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. పాలకవర్గ సభ్యులతో కలిసి సమగ్ర ప్రణాళికలు రూపొందించి పట్టణంలోని 22 వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, పారిశుద్ధ్యాన్ని బలోపేతం చేయడం, ప్రజలకు సరిపడా మంచినీటి సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తామని పేర్కొన్నారు. గతం గురించి మాట్లాడటానికి బదులు ఇప్పటి నుంచి పరకాల అభివృద్ధి కోసం కష్టపడటమే ముఖ్యమని, వచ్చే ఐదు సంవత్సరాల్లో పట్టణంలో స్పష్టమైన మార్పు తీసుకు రావడమే తన లక్ష్యమని అన్నారు.ప్రజలకు చైర్మన్ కార్యాలయం ఎప్పుడూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో చైర్మన్ ఛాంబర్‌ను కిందికి మార్చామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా వచ్చి తమ సమస్యలను తెలియజేసేలా, వాటికి తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.పరకాల అభివృద్ధి కోసం ప్రజల సహకారం అవసరమని, “మన పరకాల – మన బాధ్యత” అనే భావనతో అందరూ కలిసి పనిచేస్తే పట్టణాన్ని నిజంగా ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

### కాంప్లెక్స్ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

అక్షర దర్బార్,పరకాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పరకాలలో ఐదు మండలాల బయోసైన్స్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల వేతనాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. రాబోయే కాలంలో ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలల్లోనే అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ నెలలో పదవీ విరమణ పొందుతున్న మనోరమ (జెడ్పీహెచ్ఎస్ కౌకొండ), స్వరూప రాణి (జెడ్పీహెచ్ఎస్ ఊరుగొండ)లను ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. అనంతరం కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డిని సన్మానించారు.కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మధు, ఎంఈఓ రమ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు దగ్గు తిరుపతి రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మోడెం రాజేందర్ బాబు పాల్గొన్నారు.




## దాతృత్వం చాటుకున్న కౌన్సిలర్ విజయ్ కుమార్

- మృతురాలి కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాల పంపిణీ
- కౌన్సిలర్ విజయ్ కుమార్ కు బాధిత కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన యాట నాగరాణి (ముదిరాజ్) అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న పరకాల పట్టణ 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందజేసి ఆదుకున్నారు.ఈ సందర్భంగా వారి దయార్థ హృదయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, బూత్ అధ్యక్షులు వెల్దండి హేమంత్ కుమార్, చెట్ల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## ఎంపీఓ వివాహానికి కాంగ్రెస్ శ్రేణుల హాజరు

అక్షర దర్బార్,నడికూడ : నడికూడ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న మార్గవి రెడ్డి వివాహ వేడుకకు కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాదులో జరిగిన ఈ వేడుకలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి (చందు), గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారగని కుమరస్వామి, డాక్టర్ జాన్ (మణుగూరు), కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు పరమండ్ల మహేందర్ తదితరులు పాల్గొని, వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## శివాలయ నిర్మాణానికి భూమి పూజ

### పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



అక్షరదర్బార్, నడికూడ: శుక్రవారం నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో నూతన శివాలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామంలో శివాలయ నిర్మాణం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

## ‘ప్రజాపాలన’లో భాగంగా పనులపై సమీక్ష..

### ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ సీఈఓ

అక్షర దర్బార్, నడికూడ : ‘99 డేస్ ప్రజాపాలన’ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా పరిషత్ సీఈఓ బి. శేషాద్రి శుక్రవారం నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల ఎంపీడీఓ రామకృష్ణతో పాటు ఈజీఎస్ సిబ్బంది, మినిస్టీరియల్ మరియు నాలుగో తరగతి ఉద్యోగులు ఆయనను శాలువాలతో సన్మానించారు.అనంతరం సీఈఓ శేషాద్రి కార్యాలయంలో ఈజీఎస్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఏపీఓ, ఈసీ, టీఏలకు తగిన సూచనలు, సలహాలు అందించారు. కార్యాలయ పరిసరాల పరిశుభ్రతను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ హనుమంతరావు, ఏపీఓ విద్యావతి, సీనియర్ సహాయకురాలు సరోజన, ఈసీ రజినీకాంత్, టీఏలు స్వప్న, కుసుమ, రాధిక, కార్యాలయ జూనియర్ సహాయకులు శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్, సాయికృష్ణ, సిబ్బంది గోవిందు నవీన్ కుమార్, దొంతుల రాజేందర్, కంప్యూటర్ ఆపరేటర్లు దర్శన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# రేపు ఇసుక వేలం ..

- ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- పరకాల తహసీల్దార్ విజయలక్ష్మి

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలంలో ఉన్న ఇసుక నిల్వల విక్రయానికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయం బహిరంగ వేలం నోటీసు జారీ చేసింది. గనులు–ఖనిజాల శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలో గుర్తించిన ఇసుక డంప్‌ను వేలం ద్వారా విక్రయించనున్నట్లు పరకాల తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. ఫిబ్రవరి 28న నిర్వహించిన సర్వే ప్రకారం మండలంలో సుమారు 190 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఇసుకను మార్చి 7న ఉదయం 11:30 గంటలకు పరకాల తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.వేలంలో పాల్గొనదలచిన వారు నిర్దేశించిన ఫీజు చెల్లించి ముందుగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. వేలంలో కొనుగోలు చేసిన ఇసుకను 24 గంటల్లో తూకం వేయించి తరలించాల్సి ఉంటుందని, రవాణా సమయంలో సంబంధిత అనుమతులు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.



# అంగన్వాడీ కేంద్రాల్లో బీఆర్ఎస్వీ నేతల తనిఖీ

అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పలు సమస్యలు ఉన్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ తెలిపారు. ఆయన పలు అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేసి మాట్లాడారు. కొన్ని సెంటర్లలో టీచర్లు, ఆయమ్మలు లేకపోవడం, రెండు సెంటర్లను ఒకే చోట నిర్వహించడం వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా కొన్ని కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడం, కోడిగుడ్లపై సరైన ముద్రలు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారుల నుండి ఎక్కువ సంతకాలు తీసుకుని తక్కువ గుడ్లు ఇస్తున్నారని కూడా ఆరోపించారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను అధికారులు తనిఖీ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మండల నాయకుడు కూతాటి రమేష్, బీఆర్ఎస్వీ కళాశాల అధ్యక్షుడు బండారి సిద్దు, బీఆర్ఎస్వీ నాయకుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల్లో జోష్

- ఘనంగా ప్రారంభమైన 4వ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్
- వాలీబాల్ ఆడి సిబ్బందిని ఉత్సాహపరిచిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



అక్షరదర్బార్, భూపాలపల్లి:
పోలీసు విధుల్లో ఉండే ఒత్తిడిని అధిగమించి, శారీరక దృఢత్వం, ఐక్యతను పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "నాలుగవ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2026" ను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 194 మంది పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది కోసం ట్రాక్ ఈవెంట్లతో పాటు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వయంగా వాలీబాల్ కోర్టులోకి దిగి అడిషనల్ ఎస్పీతో కలిసి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపారు.

**- యువతకు పెద్దపీట**

శాఖాపరమైన పోటీలతో పాటు సామాజిక బాధ్యతగా కమ్యూనిటీ పోలీసింగ్ కింద జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామీణ యువతను ఇందులో భాగస్వామ్యం చేశారు. యువత కోసం ప్రత్యేకంగా 13 జట్లను ఏర్పాటు చేసి వారికి వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలను నిర్వహించడం విశేషం. ఈ క్రీడా వేడుకలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం

అక్షరదర్బార్, హసన్ పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి సమీపంలోని పెద్ద చెరువు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సుప్రతిక, అక్రమ్ తమ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందంటే, లారీ చక్రాల కింద పడి విద్యార్థిని సుప్రతిక, విద్యార్థి అక్రమ్ ఇద్దరూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ ఎస్సార్ కాలేజీలో చదువుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.



**- అతివేగమే..**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద ఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న హసన్‌పర్తి పోలీసులు వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హనుమకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలుపుతున్నారు. చదువుకుని ఉన్నత స్థాయికి ఎదుగుతారనుకున్న విద్యార్థులు ఇలా అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

శాయంపేట, అక్షర దర్బార్: శాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా భారీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజని అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో సుమారు 500 మంది విద్యార్థినులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణ, పీడియాట్రిక్ డాక్టర్ తిరుపతి, డెంటిస్టు డాక్టర్ భాను చందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ హారిక, ఫిజీషియన్ డాక్టర్ మునీబ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రవీందర్, సంధ్యారాణి పాల్గొని విద్యార్థినులకు ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రావణి, హెల్త్ సూపర్వైజర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



# కాలువలో పిచ్చి చెట్లు తొలగింపు

అక్షర దర్బార్, శాయంపేట: రైతుల పంట పొలాలకు నీరు సక్రమంగా చేరేలా మండలంలోని మాందారిపేట శివారు ప్రాంతంలో ఉన్న ఎస్ఆర్ఎస్పీ కాలువను శుభ్రం చేశారు. కాలువలో పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన మట్టిని జేసీబీ సహాయంతో తొలగించారు. ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, చలివాగు ప్రాజెక్టు డైరెక్టర్ కుక్కల తిరుపతి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. కాలువ శుభ్రం చేయడంతో రంగయ్యకుంట, పెద్దకుంట, తుర్కకుంటలకు నీరు చేరే అవకాశం ఏర్పడింది. దీంతో వరి, మొక్క జొన్న పంటలు సాగు చేస్తున్న రైతులకు ఊరట లభించనుంది.



# పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లిలో ఘనంగా ప్రారంభమైన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'



అక్షరదర్బార్, భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబం పరిశుభ్రతను ఒక బాధ్యతగా పాటించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి నుంచి జూన్ 12వ తేదీ వరకు మొత్తం 99 రోజుల పాటు ఈ ప్రగతి ప్రణాళిక కొనసాగుతుందని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీలు, కాలనీలు, ఇళ్ల పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల రహిత సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన పేర్కొన్నారు.

**- సమస్యల గుర్తింపు - తక్షణ పరిష్కారం**

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదలే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే తెలిపారు. లో–వోల్టేజ్ సమస్యలు లేకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయడం, అవసరమైన చోట కొత్త మీటర్లు మంజూరు చేయడం, డ్రైనేజీ సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టడం, విద్యార్థుల హాస్టల్ వసతులపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, ప్రజలకు నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. 99 రోజుల సువర్ణావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమ స్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని స్పష్టం చేశా రు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మాదిగల పక్షాన నిలిచా !

- ఎస్సీ వర్గీకరణ విషయంలో వారి వైపే న్యాయం ఉంది..
- అదే.. నా మిత్రధర్మం
- ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నా
- సీఎం రేవంత్ రెడ్డి




అక్షరదర్బార్, హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణ అంశంలో న్యాయం మాదిగల వైపు ఉందని, అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వారి పక్షాన నిలబడ్డానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ ధన్యవాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా వర్గీకరణ పోరాటాన్ని తాను ప్రత్యక్షంగా గమనిస్తున్నానని తెలిపారు. మాటలతో కాకుండా పూర్తి నిబద్ధతతోనే ఈ విజయాన్ని సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో మాదిగలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 2023 ఎన్నికల్లో ప్రజలు తమ జీవితాల్లో మార్పు రావాలనే బలమైన ఆకాంక్షతో కష్టపడి ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని గుర్తు చేశారు. వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, ఎన్నో కమిషన్లు, చిక్కుముడులను దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నామని వివరించారు. మాదిగ నేతలు కృష్ణ మాదిగ, సతీష్ మాదిగ ఎప్పుడు అడిగినా తన శక్తి మేర అండగా నిలిచానని చెప్పారు. గతంలో అసెంబ్లీలో వర్గీకరణపై వాయిదా తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు అప్పటి పాలకులు తనతో పాటు సండ్ర వెంకటవీరయ్య, సంపత్ కుమార్‌లను బయటకు గెంటివేసిన చేదు జ్ఞాపకాలను సీఎం గుర్తు చేసుకున్నారు. తనకు మహాభారతంలో కర్ణుడు, బార్బరీకుడు అనే పాత్రలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. కర్ణుడు అవమానం జరిగినప్పుడు పోరాడి మిత్రధర్మాన్ని ఎలా నెరవేర్చారో, తాను కూడా అలాగే మాదిగలకు అండగా ఉండి మిత్రధర్మాన్ని పాటిస్తున్నానని ప్రకటించారు. భవిష్యత్తులో కూడా మాదిగలకు తన వంతు సాయం అందిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## 300 కిలోల పట్టిక, 100 కిలోల బెల్లం పట్టివేత



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ముత్తోజిపేట వద్ద వాహన తనిఖీలలో నాటుసారా తయారీకి ఉపయోగించే 300 కిలోల పట్టిక, 100 కిలోల బెల్లం, 5 లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు నాటుసారా నియంత్రణ కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఖచ్చితమైన సమాచారంతో వాహన తనిఖీలు చేయగా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లెకు చెందిన బానోతు రాజన్న కారులో ఈ ముడి పదార్థాలు రవాణా చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాటా విస్టా కారు, ఒక మొబైల్ ఫోన్‌ను కూడా సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్సై శార్వాణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కలకలం

- మహిళ ముగ్గు వేస్తుండగా గొలుసు అపహరణ
- హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో ఘటన



అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో శుక్రవారం ఉదయం చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా దాడి చేసి గొలుసుతో పారిపోయారు. ఈ ఘటనతో బాధితురాలు మామిండ్ల నవ్య తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చోరీ జరిగిన వెంటనే నవ్య తేరుకుని దొంగలను పట్టుకునేందుకు బైక్ వెనుక కొంత దూరం పరుగు తీశారు. అప్పటికే దుండగులు వేగంగా తప్పించుకున్నారు. బాధితురాలు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు తనిఖీ చేశారు. నవ్య మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లడం, ఆమె దొంగల వెంట పరిగెత్తడం కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## 8న ఉచిత వైద్య శిబిరం

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మార్చి 8న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, హనుమకొండకు చెందిన శ్రీనివాస హాస్పిటల్, జీపీ పాలక వర్గం, స్థానిక డ్వాక్రా మహిళా సంఘాలు, గ్రామస్తుల సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

## త్వరలో ఓటర్ల జాబితా ప్రక్షాళన

- 'ఎస్ఐఆర్' ప్రారంభానికి రంగం సిద్ధం
- తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ప్రక్రియ
- నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ సహా దేశంలోని 22 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. నకిలీ ఓట్లను తొలగించి, జాబితాను పూర్తిస్థాయిలో శుద్ధి చేసేందుకు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ ఏప్రిల్ నెలలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అవసరమైన సన్నాహకాలు, అధికారుల శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ప్రారంభించారు. తెలంగాణలో ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి మే 2026 నాటికి క్షేత్రస్థాయి పనులు వేగవంతం కానున్నాయి. 2002 నాటి పాత డేటాను ప్రస్తుత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే పనిని అధికారులు ఇప్పటికే మొదలుపెట్టారు. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే సమ్మరీ రివిజన్‌లో కేవలం మార్పులు, చేర్పులు మాత్రమే చేస్తారు. కానీ ఎస్ఐఆర్ అనేది చాలా లోతైన ప్రక్రియ. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు నేరుగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో వెరిఫై చేస్తారు. ఈ ప్రక్షాళనలో అత్యాధునిక సాంకేతికతను, ఏఐ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించనున్నారు. ఒకే వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓట్లు ఉంటే ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా సులభంగా గుర్తిస్తారు. పట్టణీకరణ వల్ల నివాస ప్రాంతాలు మారిన వారి ఓట్లను సరిచేసేందుకు ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుంది. గతంలో బీహార్‌లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో, రెండో దశలో భాగంగా ఇప్పుడు తెలంగాణతో పాటు మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. ఫిబ్రవరిలో కొన్ని రాష్ట్రాల్లో తుది జాబితా విడుదల కాగా, త్వరలో తెలంగాణలోనూ పనులు పూర్తి చేయనున్నారు.




## పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ ?

- కర్ణాటకలో 16 ఏళ్లలోపు పిల్లలకు నిషేధం
- ఏపీలో 13 ఏళ్లలోపు వారికి.. నో
- తెర మీదకు తెలంగాణలోనూ అమలు చేయాలనే డిమాండ్

అక్షరదర్బార్, హైదరాబాద్ : సోషల్ మీడియా వల్ల మంచి కంటే చెడే ఎక్కువ జరుగుతుందనేది కాదనలేని సత్యం. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో చిన్నపిల్లలపై దీని ప్రభావం పెరిగిపోతోంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్, స్నాప్‌చాట్ అంటూ విద్యార్థులు చదువును పక్కన పెట్టేస్తున్నారు. 24 గంటలూ ఫోన్లకే అడిక్ట్ అయి మానసిక ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. మరికొందరు స్కూల్ వయసులోనే సోషల్ మీడియా పరిచయాల వల్ల జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పదో తరగతి కూడా పూర్తి చేయకుండానే ప్రేమ, పెళ్లి అంటూ ఇళ్లను వదిలి వెళ్తున్నారు. ఇలా వెళ్లిన పిల్లలపై అత్యాచారాలు జరగడం, టార్చర్ చేయడం వంటి ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలోనూ 16 ఏళ్ల లోపు వారిపై సోషల్ మీడియా నిషేధం విధించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో ఒక స్కూల్ విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యం ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముగ్గురు యువకులు బాలికను తీసుకువెళ్లి మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇలాంటి నేరాలకు మూలం సోషల్ మీడియానేనని, వీటిని అరికట్టాలంటే కఠినమైన ఆంక్షలు అవసరమని మేధావులు పేర్కొంటున్నారు.

### - పొరుగు రాష్ట్రాల్లో అమలు ఇలా..

పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈ దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. కర్ణాటకలో 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధిస్తూ సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో ప్రకటించారు. దేశంలోనే ఇలాంటి ఆంక్షలు విధించిన మొదటి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. అదే సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా 13 ఏళ్ల లోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధం విధిస్తామని ప్రకటించారు. రాబోయే 90 రోజుల్లో దీనిని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోవా ప్రభుత్వం కూడా చిన్నపిల్లల సోషల్ మీడియా వాడకంపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తోంది. వరుసగా పలు రాష్ట్రాలు నిషేధం దిశగా అడుగులు వేస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం కూడా త్వరలోనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. సాధారణంగా 16 ఏళ్ల పైబడిన వారికి కొంత ఆలోచనా శక్తి, మెచ్యూరిటీ ఉంటుంది. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో వారికి తెలుస్తుంది. కానీ చిన్నపిల్లలకు అలాంటి అవగాహన ఉండదు. కేవలం టైమ్ పాస్ కోసం చూస్తూ మోసగాళ్ల బారిన పడే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల భవిష్యత్తు కోసం సోషల్ మీడియా బ్యాన్ అంశాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915